క్లుప్తంగా

విపత్తుల సమయంలో రక్షణపై అవగాహన


తూర్పుతాళ్లు హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

నరసాపురం రూరల్: ప్రకృతి విపత్తులైన వరద ముంపు, రోడ్డు, అగ్ని తదితర ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన అత్యవసర సేవలను గురించి 10వ బెటాలియన్ ఎస్డీఆర్ఎఫ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ ఫింటు నంది విద్యార్థులకు వివరించారు. నరసాపురం మండలం తూర్పుతాళ్లు ఉన్న తపాఠశాలలో జాతీయ విపత్తుల నిర్వహణ అధికారులు మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. విపత్తులు సంభవించిన సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి మనల్ని మనం రక్షించుకోవడంతో పాటు ఇతరులను ఏ విధంగా రక్షించాలో వివరిస్తూ ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది లక్ష్మణరావు బృందం విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. సాధారణంగా దొరికే ఎండు కొబ్బరికాయలు, ఖాళీ వాటర్ బాటిళ్లు వంటి వాటితో లైఫ్ జాకెట్స్ ఏ విధంగా తయారు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో లక్కు వెంకటస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనిల్‌కుమార్, అడపా శ్రీను పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి సాయం


చిన్నారి తండ్రికి నగదు అందిస్తున్న పాలకొల్లు ఫోక్స్ ఫేస్‌బుక్ మిత్రులు


సాక్షి ఎఫెక్ట్

పాలకొల్లు సెంట్రల్: మూడు నెలల చిన్నారిని ఆదుకోవడానికి మానవతా దృక్పథంతో దాతలు ముందుకు వస్తున్నారు. గత నెల 6న సాక్షిలో పసిబిడ్డ వైద్యానికి ఆదుకోండి సారూ శీర్షికన ప్రచురించిన కథనానికి దాతలు స్పందించారు. శనివారం పాలకొల్లు ఫోక్స్ ఫేస్‌బుక్ గ్రూప్ సభ్యులు స్పందించి చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం అందించారు. పాలకొల్లు హౌసింగ్ బోర్డు కాలనీ 25వ వార్డుకు చెందిన జక్కంపూడి వెంకటేష్, దేవి దంపతుల మూడు నెలల కుమార్తె క్రానియో సినోస్టోసిస్ వ్యాధితో బాధపడుతుంది. పాప అనారోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఫేస్‌బుక్ మిత్రులు రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఫేస్‌బుక్ అడ్మిన్ నరసింహరాజు మాట్లాడుతూ పాపకు వైద్యం చేయించడానికి సుమారు రూ. 4 లక్షలు ఖర్చవుతుందని సాక్షి కథనంలో చూశామన్నారు. ఫేస్‌బుక్ మిత్రులందరూ కలిసి రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పాపకు ఫిజియోథెరపీ చేయాలని వైద్యులు నిర్ణయించడంతో ప్రస్తుతానికి కొంత నగదు అందజేశామని ఆపరేషన్‌కు వెళ్లే ముందు మిగిలిన నగదు అందజేయనున్నట్లు తెలిపారు. మిత్రులు వింజరపు కిషోర్, పులపర్తి రాము, కేతా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష గ్రామ సభల షెడ్యూల్ ఇలా

యలమంచిలి: మండలంలోని 23 గ్రామ సచివాలయాల్లో జరిగే జగనన్న సురక్ష గ్రామ సభల షెడ్యూల్‌ను ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి విడుదల చేశారు. రెండు టీమ్‌లు ఈ గ్రామ సభలను నిర్వహిస్తుండగా మొదటి టీమ్‌కు తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, రెండవ టీమ్‌కు ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి నేతృత్వం వహిస్తారు. ఈ సభలను మండల ప్రత్యేక అధికారి, డ్వామా ఏపీడీ బి వీరాస్వామి పర్యవేక్షిస్తారు. ఈ నెల 4న ఏనుగువానిలంక, కలగంపూడి 6న బాడవ, గుంపర్రు 11న ఆర్యపేట, మట్లపాలెం 13న కొంతేరు, నారినమెరక 15న యలమంచిలి, చించినాడ 18న దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం 20న ఇలపకుర్రు, బూరుగుపల్లి 22న ఆడవిపాలెం, కనకాయలంక 25న కాజ తూర్పు, కాంభొట్లపాలెం 27న కట్టుపాలెం, పెనుమర్రు 29న కాజ పడమర గ్రామాల్లో సభలు నిర్వహిస్తారు.

శాకంబరిగా శ్రీ ముఖధారమ్మ


ప్రత్యేకాలంకరణలో ముఖధారమ్మ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువు గట్టున ఉన్న శ్రీ ముఖధారమ్మ ఆలయంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఆషాఢ మాసం సందర్భంగా శనివారం వివిధ రకాల పండ్లు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం వరకూ అమ్మవారి అలంకరణ ఉంటుందని ఆలయ ప్రెసిడెంట్ కుంపట్ల చిన రాజా తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సెక్రటరీ చినిమిల్లి బాబి, ఉపాధ్యక్షులు చెక్కా కృష్ణ, సభ్యులు మండెల జీజీ, జాన మురళి, బొర్రా చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి మరో అడుగు జగనన్న సురక్ష


నరసాపురం పట్టణంలో ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


మేడపాడులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్


పెనుగొండలో సీసీఎస్ ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

నరసాపురం రూరల్: పేదలకు సంక్షేమాన్ని అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేసిన మరో అడుగే జగనన్న సురక్ష కార్యక్రమమని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం పట్టణంలో 1వ వార్డు శ్రీహరిపేట సచివాలయం వద్ద, చిట్టవరంలోని సచివాలయం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా ప్రభుత్వ పథకాలు అందరని అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జగనన్న సురక్ష క్యాంపుల వద్ద నిర్ణీత తేదీల్లో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని మీ సమస్య అక్కడికక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం ప్రజలకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కౌలురైతు కార్డులు ఆయన పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో అంబేడ్కర్ భవనంలో నిర్మించిన కిచెన్ షెడ్‌ను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్‌రెడ్డి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, కౌన్సిలర్ దుర్గా భవాని, కడలి రాంబాబు, చినిమిల్లి చంద్రశేఖర్, మున్సిపల్ కౌన్సిలర్ కె.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఎన్వీ శివప్రసాద్‌యాదవ్, వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్ కుమారి, సర్పంచ్ తాడి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు నక్కా లక్ష్మీనారాయణ, కాకిలేటి మధు, కోళ్ల శ్రీను, చల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పాలన

మొగల్తూరు: ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష ఒక బృహత్తర కార్యక్రమమని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. శనివారం మొగల్తూరు 1 సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులై ఉండి గతంలో ప్రభుత్వ పథకాలు అందని వారు మరోసారి దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాలకు సంబంధించి వచ్చిన దరఖాస్తుల విషయమై సరైన సమాచారం ఇవ్వని సంబంధిత అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం 117 కుల ధ్రువీకరణ పత్రాలను, 116 ఆదాయ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, ఎంపీపీ అందే సూర్యావతి భుజంగరావు, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు, ఎంపీటీసీ సభ్యుడు దూనసపూడి దొరబాబు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమంపై సీఎం జగన్‌కు చిత్తశుద్ధి

పెనుగొండ: రాష్ట్రంలో పేదలకు సంక్షేమం అందించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి జగనన్న సురక్షతో తెలుస్తుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం ఆచంట నియోజకవర్గంలో ఆచంట, పెదమల్లం, పెనుగొండ, వడలి గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు సీసీఎస్ కార్డులు, ఇతర ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనుగొండలో గత పాలకులు కాలనీల అభివృద్ధిని విస్మరించారని మండిపడ్డారు. కోడి పందెల దిబ్బ, మాజీ శాసన సభ్యుడు వంక కాలంలో ఏర్పాటు చేసిన నగరేశ్వర స్వామి కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. ప్రస్తుతం రెండు ప్రాంతాల్లోనూ రహదారులు, విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు, సొంత ఖర్చులతో తాగునీరు అందిస్తున్నామన్నారు. పెనుగొండ ఎంపీపీ పూతి నీడి వెంకటేశ్వరరావు(పెద్ద), జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోట సరోజనీ వెంకటేశ్వరరావు, దిరిశాల విజయలక్ష్మి, కాసాని విజయలక్ష్మి, విద్య వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరక్టరు కొప్పూరి వేణుమాధవ రెడ్డి, మండల కన్వీనరు వల్లిమిల్లి వేణుప్రతాపరెడ్డి(బాబీ), ఎంపీటీసీ సభ్యులు రెడ్డి గణేష్, చిటికెన దుర్గ భవానీ బాబీ, బాలం రామలక్ష్మీ, నక్క పద్మ, కన్వీనర్లు సాకా సుబ్రహ్మణ్యం, కాసాని శ్రీనివాసరావు, జెంత్రీ శ్రీను, పలివెల శ్రీను పాల్గొన్నారు.

ఆచంట మండలంలో

ఆచంట మండలంలో ఆచంట, పెదమల్లంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు పాల్గొని ధృవీకరణ పత్రాలు అందించారు. ఆచంటలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కోట సరోజనీ వెంకటేశ్వరరావు, దిరిశాల విజయలక్ష్మి, ఎంపీటీసీలు తప్పెట్ల విజయకుమారి, ఉల్లం జ్యోతి రామానుజం, పెచ్చెట్టి సత్యనారాయణ, నెక్కంటి రామలింగేశ్వరరావు, కుక్కల కిరణ్ వేమన అప్పారావు, కప్పల భారతి, చదలవాడ మరియమ్మ పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: టీడీపీ ప్రభుత్వం వస్తే ఇప్పుడున్న పథకాలన్నీ కొనసాగిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు చెబుతున్న కల్లబొల్లి మాటలను ప్రజలెవరూ నమ్మవద్దని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పోడూరు-1, తూర్పుపాలెం సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. టీడీపీ నేతలు మొన్నటి వరకు గ్రామాల్లో తిరుగుతూ ఓట్లు తొలగిస్తున్నారంటూ దుష్ప్రచారం చేశారనీ, ఇప్పుడేమో వాళ్లే ఓటరు జాబితాలో ఫేక్ ఓటర్లు ఉన్నారంటూ ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సర్పిలి సుమంగళి, తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, ఎంపీడీఓ డి.సుహాసిని, సర్పంచ్‌లు శెట్టిబత్తుల సువర్ణరాజు, గుబ్బల ఉషారాణి బ్రహ్మం, రామన వీర్రాజు, మండల కన్వీనర్ పిల్లి నాగన్న, ఏపీసీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, ఎంపీటీసీ సభ్యుడు పోడూరి నాగరాజారావు, డిప్యూటీ తహసీల్దార్ డి.రాజేష్, ఈఓపీఆర్‌డీ ఎం.బలరామరాజు, జేసీఎస్ కన్వీనర్ పైడి ఏసుబాబు, ఏఎంసీ డైరెక్టర్ గంటా గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

పెనుమంట్ర: అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం భట్లమగుటూరు, ఆలమూరు గ్రామాలలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా భట్లమగుటూరు గ్రామంలో 117 కుల ధ్రువీకరణ పత్రాలు, 102 ఆధార్ , 20 కౌలురైతు కార్డులు, 35 ఆధార్‌లింక్‌కార్డులు, అందజేయగా ఆలమూరు గ్రామంలో 68 కుల ధృవీకరణ, 58 ఆదాయ ధృవీకరణ పత్రాలు, 40 కౌలు రైతు కార్డులు, 13 రేషన్‌కార్డులు, 4 ఆధార్‌లింక్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో పెనుగొండ ఏఎంసీ చైర్ పర్సన్ వెలగల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి, మండల పరిషత్ ఉపాధ్యక్షరాలు ఈది అనిత ప్రవీణ్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


ఆచంటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


ఆగర్తిపాలెంలో ధ్రువీకరణ పత్రం అందిస్తున్న దృశ్యం

యలమంచిలి: రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలు అందజేయడమే జగనన్న ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్సీ, పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. మేడపాడు, శిరగాలపల్లి గ్రామాలలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వాలన్నీ ప్రజలకు సంక్షేమ పథకాలు ఏ విధంగా ఎగ్గొట్టాలా అని ఆలోచనతో ప్రభుత్వ పథకాల అమలుకు అనేక నిబంధనలు పెట్టి అర్హుల సంఖ్య తగ్గించడానికి శతవిధాల కృషి చేసేవన్నారు. కానీ జగనన్న ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు అందుకోవడానికి ఏ చిన్న అవరోధం ఉన్న వాటిని తొలగించి ఆ పథకాలను ప్రజలకు అందించడానికి జగనన్న మానస పుత్రికలైన వలంటీర్ల ద్వారా ప్రతి ఇల్లు జల్లెడ పట్టి అర్హులకు జగనన్న సురక్ష పథకం ద్వారా న్యాయం చేయడానికి శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ, రెండు గ్రామాల సర్పంచ్‌లు గంటా శాంతకుమారి, చిలుకూరి సుబ్బారావు చౌదరి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు గుర్రాల వెంకట్రావు, వీరవల్లి నరసింహమూర్తి ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు సర్పంచ్‌ల ఛాంబర్ మండల అధ్యక్షుడు వల్లభసాయి వెంకట నరసింహారావు పార్టీ నాయకులు, సర్పంచులు ఉచ్చుల స్టాలిన్, బోనం బులివెంకన్న, పాలంకి శ్రీనివాసరావు, కవురు గోపి, పైడి వెంకటేశ్వరరావు, కుక్కల బాలచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: నవరత్నాల పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో జగనన్న సురక్షా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అన్నారు. పాలకొల్లు మండలంలోని ఆగర్రు, ఆగర్తిపాలెం గ్రామాల్లో సర్పంచ్‌లు సాకా గంగారత్నం, గూడూరి కేషవేణి అధ్యక్షతన శనివారం గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీపీ కనకలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సాంకేతిక కారణాల వలన సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులకు జగనన్న సురక్షా పథకంలో అర్హత ప్రామాణికాలను పరిశీలిస్తారన్నారు. అలాగే కార్యాలయాల చుట్టూ తిరగకుండా కుల, ఆదాయ, కౌలు రైతు గుర్తింపు కార్డులు, పుట్టిన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుల ధృవీకరణ, పట్టాదారు పాస్ పుస్తకాలు, రేషన్‌కార్డుల్లో పేర్లు తొలగింపు, సభ్యులను చేర్పుట తదితర పత్రాలను అదే రోజు గ్రామ సభలో లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని సంక్షేమ పథకాలను ఏపీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఆగర్తిపాలెంలో రూ.90లక్షలతో మంచినీటి పథకం నిర్మాణం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పాల్గొని ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి ఎస్ రఘునంద, తహసిల్దార్ సీహెచ్ పెద్దిరాజు, ఎంపీడీవో నంగాని వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు, ఎంపీటీసీ చింతపల్లి సాయిబాబా, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, ఆగర్రు సొసైటీ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, పార్టీ నాయకులు కండిబోయిన శివన్నారాయణ, అడిదెల సుధాకర్, సాకా కమలాకర్, పానుకుమట్ల వీరాస్వామి, మేడిది చంద్రప్రసాద్, పిల్లి శ్యామ్, మేడిది జోసఫ్, రాహుల్, డా. థామోస్, పంచాయతీ కార్యదర్శులు ఎం ఆనందబాబు, కోట బుల్లిరాజు, వీఆర్వో ఎస్ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారికి పింఛన్ అందజేత


పింఛన్ అందిస్తున్న సర్పంచ్ నగేష్ కరుణాకర్

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రుకి చెందిన తవిటిక జెస్లిన్ తలసేమియాతో బాధపడుతోంది. చిన్నారికి ప్రభుత్వం రూ.10వేలు పింఛన్ మంజూరు చేసింది. ఈ పింఛన్‌ను శనివారం దిగమర్రు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్, సంక్షేమ కార్యదర్శి లోకేష్ చేతుల మీదుగా అందజేశారు.

సామూహిక కుంకుమార్చనలు

పెనుగొండ: పెనుగొండ జద్దువారి వీధిలోని కనక దుర్గమ్మ ఆలయం వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించడానికి భక్తులు బారులు తీరారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్న సమారాధన నిర్వహించారు.

అమ్మఒడి విద్యార్థులకు వరం


మొగల్తూరులో అమ్మ ఒడి నమూనా చెక్కును విద్యార్థులకు అందిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న అమ్మ ఒడి పథకం విద్యార్థులకు ఓ వరం లాంటిదని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం మొగల్తూరు పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నాలుగో విడత అమ్మ ఒడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్య భారమైన ఈ రోజుల్లో నేనున్నానంటూ విద్యార్థులకు అండగా అమ్మ ఒడి, విద్యా దీవన, వసతి దీవెన లాంటి పథకాలు ప్రవేశపెట్టి విద్యార్థులకు చదువు ప్రాధాన్యత తెలిపిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. నాడు-నేడు పథకంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నాడు నేడు లో రూ25 కోట్ల తోనియోజకవర్గంలోని కొన్ని పాఠశాలలను అభివృద్ధి చేశామని, రాబోయే విద్యా సంవత్సరం నాటికి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. విద్యార్థులకు రూ.3 వేల విలువైన జగనన్న విద్యా కానుక కిట్లను అందించడమే కాక మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన, పౌష్టికమైన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు దూనసపూడి దొరబాబు, ఆకన దొరబాబు, సొసైటీ అధ్యక్షులు మోటుపల్లి రాంభాస్కరరావు, ఉపసర్పంచ్ బోణం నర్సింహారావు, నాయకులు అందే భుజంగరావు, కుక్కల కృష్ణ మోహన్, పడవల సత్యనారాయణ, పాలా రాంబాబు, కంచర్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల మద్దతు వైఎస్సార్ సీపీకే

నరసాపురం రూరల్: ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాల మద్దతు వైఎస్సార్ సీపీకే ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి క్యాంపు కార్యాలయంలో నరసాపురం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, పెద్దలతో జరిగిన సమావేశంలో ప్రసాదరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బడుగు బలహీన వర్గాలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఢీకొట్టడానికి అన్ని రాజకీయ పార్టీలు ఏకమవుతున్నాయని, ఈ సందర్భంలో పార్టీని బలోపేతం చేయడంలో పార్టీ శ్రేణుల పాత్ర కీలకమని ప్రసాదరాజు పేర్కొన్నారు.

'పవన్ కల్యాణ్ వీధి రౌడీలా మాట్లాడడం తగదు'


విన్సన్‌బాబు

పోడూరు: వారాహి యాత్రలో భాగంగా భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీధిరౌడీలా మాట్లాడడం ఏమాత్రం తగదని వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్‌విభాగం అధ్యక్షులు కుంచలపల్లి విన్సన్‌బాబు ఖండించారు. పోడూరు మండలం జిన్నూరులో శనివారం ఆయన మాట్లాడుతూ భీమవరంలో పవన్‌కల్యాణ్ మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండించారు. పవన్ తన వ్యాఖ్యలతో రాజకీయ పరిపక్వతలేని నాయకుడని మరోసారి నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. అంబేడ్కర్ సెంటర్‌లో ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహానికి పూలమాల వేయాలన్న కనీస సంస్కారం పవన్‌కు లేకపోయిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై పవన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు దేవ రాజేష్‌కుమార్ కూడా ఖండించారు.

ఘనంగా డాక్టర్స్ డే


పాలకొల్లులో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అల్లు వెంకటేశ్వరరావు మెమోరియల్ మునిసిపల్ ప్రైమరీ స్కూల్లో శనివారం ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్స్ డే సందర్భంగా స్థానిక దంత వైద్యురాలు మల్లుల జ్ఞానేశ్వరి చిన్నారులకు దంత పరీక్షలు చేశారు. అనంతరం విద్యార్థులకు టూత్‌పేస్టులు, బ్రష్‌లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వీవీ ప్రసాద్, వీవీ రోజారమణి, గుంపుల రవి, కోళ్ల సింహాద్రి, విశ్వ మానవ వేదిక అధ్యక్షులు మల్లుల సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో వైద్యులకు సన్మానం...

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆసుపత్రి ఆవరణలో డా.బీసీ రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చినిమిల్లి గణపతిరావు, చెన్ను విజయ్‌లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. జి ప్రభాకర్, వైద్యులు డా.నళిని, డా. సునీత, డా.గీతాకుమారి, సునీత, పి ఉష, జయదుర్గా, రేణుకా చౌదరి, సౌజన్య, ప్రశాంతి, భవాని, రాంబాబు, కల్యాణచక్రవర్తి, భాస్కర్, సుధీర్, రిచర్డ్, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయకుమారిను శాలువాతో సత్కరించారు. అలాగే లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్స్ డే నిర్వహించారు. ఆయుష్ డాక్టర్ భవాని ప్రసాద్, డా.నవ్యజీవన్‌లను ఆసుపత్రి సిబ్బంది శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఆరోగ్య విస్తరణాధికారి కె ప్రభాకర్, పీహెచ్ఎన్ ఎలిజబెత్, హెల్త్ విజిటర్ కమల పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసాపురం-పాలకొల్లు రోడ్డులోని సంసిద్ధ్ విద్యాసంస్థల విద్యార్థులు వైద్యుల వేషధారణలో నరసాపురం పట్టణంలోని సీనియర్ వైద్యుడు చినమిల్లి సత్యనారాయణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులు పట్టణంలోని డాక్టర్లు సాంబమూర్తి, బళ్ల మురళి, నరసింహారావు, అందే రామనరేష్, చినమిల్లి శ్రీనివాస్, రవికల్యాణ్ తదితరులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పని చేయాలి


అప్పన్నచెరువు గ్రామ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌గా నియమితులైన ఎస్ఎస్ మూర్తిను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడానికి ప్రతీ ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ కోరారు. పోడూరు మండలం అప్పన్నచెరువు గ్రామానికి చెందిన రిటైర్డు ఉద్యోగి ఎస్ఎస్ మూర్తిని గ్రామ ఇన్‌చార్జ్‌గా నియమించిన సందర్భంగా పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో శనివారం శాలువాతో సత్కరించి అభినందించారు. గ్రామ, మండలంలోని పార్టీ నాయకులతో మమేకమై వైఎస్సార్‌సీపీ బలోపేతం కావడానికి విలువైన సూచనలు, సలహాలు అందించి పార్టీని విజయపథం వైపు నడిపించాలని కోరారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీటీడీసీ బాబు, సర్పంచ్ బీరా జ్ఞానకుమారి, బీరా రత్నరాజు, పార్టీ అధ్యక్షుడు గుమ్మాపు రాంబాబు, కార్యదర్శి నెల్లి ప్రసాద్, కన్వీనర్ కె.రత్నరాజు, పార్టీ నాయకులు బుడితి పౌలురాజు, కునుమే లాజర్, బీరా సురేష్, యాలంగి మూర్తి, వి సాల్మన్‌రాజు, మద్దా చంద్రకళ పాల్గొన్నారు.